ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వేసవి సెలవుల్లో విద్యార్థులు బయటికి వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం విద్యారులకు డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. చదువుతో పాటు డ్యాన్స్, ఆటల పోటీల్లో కూడా విద్యార్థులు పాల్గొ వాలని గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.సుబ్బారావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ఈదురుగాలులు, పిడుగులతో భారీ వర్షం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

మండలంలోని గురువారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి భానుడి ప్రతాపానికి తీవ్రమైన వడగాలులు, ఉక్కపోతతో మన్యం వాసులు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి నల్ల మబ్బులు కమ్ముకొని, ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ఎండ వేడి నుండి మండల వాసులు ఉపశమనం పొందారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

దుంబ్రిగుడలో జోరు వాన

రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి, సూరంపాలెం, కొండపల్లి, వయ్యాడు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

డుంబ్రిగుడ: మండలంలో గురువారం ఈదురు గాలులు, పిడుగుల శబ్దాలతో కూడిన భారీ కుండ పోత వర్షం కురిసింది. ఎండల తీవ్రతకు ఉక్కిరిబిక్కిరి అయిన మండల వాసులకు ఈ వర్షంతో వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం కలిగించింది. ఈ భారీ వర్షంతో పోడు వ్యవసాయం సాగు చేసే రైతులు, పలు కూరగాయలు సాగు చేసే గిరిజనులు పనులు చేయడంలో నిమగ్నమవుతున్నారు.

అరకులోయ మండలంలో భారీ వర్షం కురిసింది. పిడుగులతో భారీ వర్షం కురవడంతో వీధులన్నీ జలమయం అయ్యాయి. వర్షంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

కారవాన్ టూరిజం ఏర్పాటుకు భూ సేకరణ

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో కారవాన్ టూరిజం ఏర్పాటుకు భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం, ముంచంగిపుట్టు మండలం సుజన కోట, రంపచోడవరం, మారేడుమిల్లి డుంబ్రిగూడ మండలం అంజోడ, చింతపల్లి మండలం చెరువులవేనం పరిసరాల్లో కారవాన్ టూరిజం ఏర్పాటుకు ఒక్కొక్క చోట ఎకరం భూమి సేకరించాలన్నారు. గురువారం తహశీల్దారులు, ఎంపిడిఓలు, పర్యాటక శాఖ, అటవీ శాఖ అధికారులతో పర్యాటక అభివృద్ధి లో భాగంగా గిరిజన ప్రాంతాలలో పర్యాటకులు హెూమ్ స్టే ఏర్పాట్లపై కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన గ్రామాల్లో హెూమ్ స్టేలు ఏర్పాట్లుకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. హెూమ్ స్టేల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి వచ్చే సెప్టెంబరు నాటికి స్టే హెూమ్ లు వినియోగంలోకి తీసుకుని రావాలని చెప్పారు. అరకువ్యాలీ మండలం కొత్తవలస హెచ్ అండ్ టిసి, మాడగడ సన్ రైజ్ పాయింట్ వద్ద పర్యాటకులకు అరకు కాఫీ అనుభవం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ట్రైబల్ టూరిజం కౌన్సిల్ ఏర్పాటు, గిరిజన అభివృద్ధి ఫండ్ సమకూర్చడంపై అధికారులకు పలు సూచనలు చేసారు. ఆర్ట్ సెంటర్ రూపకల్పనకు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొత్తగా నిర్మించుకునే హెూమ్ స్టేకు రూ. 5 లక్షలు, పాత ఇళ్లను హెూమ్ స్టేలకు అనుకూలంగా అభివృద్ధి చేస్తే రూ. 3 లక్షలు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. హెూమ్ స్టే నిర్వహకులకు గిరిజన వంటలు తయారీపై శిక్షణ అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం పిఒ కె. సింహచలం, సిపిఓ ఎస్. డిటి ఓ దాసు, అరకు వ్యాలీ మ్యూజియం క్యూరేటర్ మురళి పాల్గొన్నారు.

వెట్ మిక్స్ వేసి వదిలేసిన రోడ్డుపై ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు, స్థానికులు

వెట్ మిక్స్ వేశారు.. రోడ్డు నిర్మాణం మరిచారు

- మూడేళ్లయినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తక్షణమే తారు రోడ్డు వేయాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్దమట్టపల్లి జంక్షన్ నుంచి బూరుగువాడ వరకు రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా సదరు కాంట్రాక్టరు వెట్‌మిక్స్ వేసి, తారురోడ్డు నిర్మాణం చేయకుండా వదిలేశారని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ తెలిపారు. వెట్‌మిక్స్ వేసి సుమారు మూడు సంవత్సరాలైనా నేటికీ తారు రోడ్డు వేయలేదని పేర్కొన్నారు. తక్షణమే తారు రోడ్డుగా నిర్మాణం చేసి బూరుగువాడతో సహా మరో ఐదారుగ్రామాల ప్రజలకు రహదారి మార్గం కల్పించాలని ఆయన కోరారు. ఈ మేరకు సంతోష్‌కుమార్‌తో పాటు స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్ తదితరులు స్థానికులతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. వెట్‌మిక్స్ వేసి వదిలేసిన రోడ్డుపై నిరసన తెలిపారు. సరైన రహదారి మార్గం లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులను ఆసుపత్రికి కూడా తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఒక గిరిజన గ్రామానికి రోడ్డు సగం సగం వేసి మూడేళ్ల నుండి తారు రోడ్డు వేయకుండా వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్నొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగిపోయిన ఈ రోడ్డు నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, కమ్మచిచ్చు సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలు గిరిజనులకే కేటాయించాలి

- మండల పరిషత్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-హుకుంపేట: ఏజెన్సీలో గిరిజనులకే శత శాతం ఉద్యోగాలు ఇవ్వాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కూడ రాజుబాబు, ఎంపీడీఓ రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ,

గత వైసీపీ ప్రభుత్వంలో జీవో 3ను సుప్రీంకోర్టు కొట్టేస్తే, పునరుద్ధరణకు కృషి చేయలేదని తెలిఆపరు. దీని ఫలితంగా మెగా డీఎస్సీ లో 881 టీచర్ పోస్టుల కు గానూ, కేవలం 30 ఎస్టీలకు కేటాయించారన్నారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు అరకులో ఇచ్చిన హామీ మేరకు, జీవో పునరుద్ధరణ చేయాలన్నారు.

తడిగిరి సర్పంచ్ రంజీత్ కుమార్ మాట్లాడుతూ తక్షణమే తీర్మానాన్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించి ఏజెన్సీ లో 100 శాతం ఉద్యోగాలు గిరిజనుల కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాకూరు సర్పంచ్ బాకూరు వెంకట రమణ రాజు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం గిరిజనుల ను అన్యాయం చేసిందని, టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవో తెచ్చి న్యాయం చేస్తుందని, ఉద్యోగా లన్నీ ఎస్టీలకే ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పీవీటీజీ గ్రామాలకు పీఎంజనమాన్‌లో తారు రోడ్లు, కొత్త చెక్ డాంలు, బాకూరు రోడ్డు మలుపు లు విస్తరణ, కొత్త ఇల్లులకు బిల్లులు చెల్లించాలని, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసి రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా పచ్చి రొట్ట, వరి విత్తనాలు సరఫరా చేయాలన్నారు.విద్యుత్ స్తంభాల ఏర్పటు, కొత్త చెక్ డాం లకు గ్రాంట్ చేయాలనీ, ఉపాధిహామీ పథకం పనుల్లో టెంట్‌లు, మజ్జిగ, మంచి నీళ్ళు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక అనుమతి తో హాజరైన బట్టి చిన్నారావు మాష్టర్, మోస్య సత్యారావు మాష్టర్ లతు జీవో నంబర్ 3 ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సన్యాసిరావు, సీడీపీఓ మని దేవి, పశువైద్యాధికారి డికె చరణ్, సీనియర్ అసిస్టెంట్ ఉమ మహేశ్వరి, ఆర్ఐ సీతమ్మ, ఎంపీటీసీలు సాంబే బాలకృష్ణ, నైని రజని, మజ్జి హరి, సర్పంచ్ లు రేగం రమేష్, సాంబ, సత్యనారాయణ, చంటమ్మ, పాడి పోతు రాజు, పద్మకుమారి, ఏఈలు సంజీవ్ రావు, జగదీష్,తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొండలరావు

సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

బలిమెల నీటి నిల్వలపై సమావేశం

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్రా ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెలా జలాశయం నీటి నిల్వలపై గురువారం ఇరు రాష్ట్రాల అధికారులు ఒరిస్సాలోని కోరాపుట్టి జిల్లాలోని ఒనకఢిల్లీ ఓహెచ్పిసి కార్యాలయంలో సమావేశమై చర్చించారు. 2024-25 నీటి సంవత్సరంలో బలిమెల జలాశయం నుంచి ఏయే రాష్ట్రం ఎంతెంత నీటిని వినియోగించుకున్నారో లెక్కలు కట్టారు. 2024 జూలై నుంచి ఏప్రిల్ 25 వరకు ఆంధ్ర తన వాటా 78.5107 టీఎంసీలు ఒరిస్సా తన వాటా 78.6480 వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. ఒరిస్సా ఆంధ్ర కంటే 0.5330 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు తేలింది. ప్రస్తుతం బలిమెలలో 17.895 టీఎంసీలు, జోలపుట్‌లో 17.2639 టీఎంసీలు నీటి నిల్వాలు ఉన్నట్లు తేల్చారు. ఈ నెలాఖరు నాటికి రెండు జలాశయాల్లో 1.7 టీఎంసీలు నీటి నిల్వలు చేరుతాయని లెక్కలు కట్టారు. దీంతో బలిమెల, జోలాపుట్‌లో మొత్తం నీటి నిల్వలు 36.8589 టీఎంసీలు లెక్కించి ఆంధ్ర వాటగా 18.4945 టీఎంసీలు, ఒరిస్సా వాటా 18.3644 టీఎంసీలుగా పంపకాలు చేశారు. కార్యక్రమంలో ఒరిస్సా తరపున దిలీప్ కుమార్ స్వైన్, రాధా మాధవ్‌ఒటా, ప్రశాంత్ కుమార్ పొట్టేరు, పితా బాసి చేతి, రమాకాంత పాత్రో, తుసార్ రంజాన్, కుంతీయ గడదర్ ప్రధాన్, ఆంధ్రా తరుపున చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజేంద్రప్రసాద్, దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని రంపచోడవరంలో అన్న క్యాంటీన్‌కు స్థానిక యూనియన్ బ్యాంక్ ప్రాంగణంలో స్థానిక శాసన సభ్యురాలు మిరియాల శిరీషదేవి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలంతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల వారు రెండు పూటలా అన్నం తినే విధంగా నాడు ఎన్టి రామారావు రెండు రూపాయలకే కిలో బియ్యం అందించారని తెలిపారు. నియోజకవర్గ కేంద్రానికి ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుండి వివిధ రకాలైన పనులు మీద వచ్చే ప్రజల కడుపు నింపేందుకు ఐదు రూపాయలకే భోజనాన్ని అన్న క్యాంటీన్ ద్వారా ప్రతిరోజు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీలో 11 మండలాలకు సంబంధించి రెండు, మూడు మండలాలకు ఒక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఐటీడీఏ పిఒ కట్టా సింహాచలం మాట్లాడుతూ అన్న క్యాంటీన్ భవన పనులు 50 రోజులలో పూర్తి చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి డైరెక్టర్ జిడి సునీత, తహశీల్దారు పి.రావకృష్ణ, సర్పంచులు మంగ బుజ్జయ్య, వంతల అత్యాయమ్మ, ఎంపీడీవో చుండం శ్రీనివాసరావు దొర, డిప్యూటీ తహశీల్దార్ జిలాని, సీఐ రవికుమార్, సిఐ వెంకటరావు, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, కారం సురేష్, వై.నిరంజని దేవి, సలాది బాపిరాజు, పెంటపాటి అనంత మోహన్, సిద్ధ వెంకన్న బాబు, షేక్ సుభాని, పోలోజు సురేష్, పండ చెల్లన దొర, పి శ్రీనివాస్, బంగారు వీరబాబు, ఏపిఎం రామ కామేశ్వర స్వామి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

మధ్యలోనే నిలిచిన గృహాలను పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

పిఎం జన్‌మన్ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్.

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పీఎం జన్మన్ గృహాల లబ్ధిదారులకు లింటల్ లెవెల్ బిల్లులు చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గెమ్మెల చిన్నబాబు, గత్తుం బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ సంగంవలస గ్రామంలో గురువారం పర్యటించి పీఎం జన్మన్ ఇల్లు నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లబ్ధిదారులు లింటల్ లెవెల్ బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. హౌసింగ్ అధికారులు లింటల్ లెవెల్ ఫొటోస్ తీసి నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని, దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఒక వైపు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్మన్ హౌసింగ్ 2026 సంవత్సరం నాటికి పూర్తి చేయాలని ప్రకటిస్తున్నప్పటికీ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించక పోతే ఎలా నిర్మాణాలు పూర్తి అవుతాయని అన్నారు. లబ్ధిదారులు హౌసింగ్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పీఎం జన్మన్ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జోషి పాల్గొన్నారు.

చైర్మన్ దొన్నుదొరను సన్మానిస్తున్న సభ్యులు

ఎమ్మెల్యే, చైర్మన్‌లను కలిసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: నూతనంగా ఎన్నికైన ఏపీడబ్ల్యూజెఎఫ్ అరకులోయ మండల కమిటీ సభ్యులు గురువారం స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎపిఎస్ఆర్టిసి విజయనగరం రీజినల్ బోర్డు చైర్మన్ సియ్యారి దొన్ను దొరలను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెలికి తీసి వార్తలు రాయాలని సూచించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున సమస్యలపై పాత్రికేయులు పత్రికలలో ప్రచురించిన వెంటనే ప్రభుత్వం స్పందిస్తుందిన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి రహీమ్, మండల అధ్యక్షుడు త్రినాద్, సహాయ కార్యదర్శి రాముునాయుడు, భీమన్న, సింహాద్రి, సింహాచలం, రాంప్రసాద్, రాంబాబు, నీలకంఠం, రామన్న పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి మావోయిస్టుల మృతదేహాలు

మావోయిస్టుల మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రంపచోడవరం

అల్లూరి జిల్లా వై.రామవరం మండలం యార్లగడ్డ పంచాయతీ శేషరాయి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టు మతహేలను శవ పంచనామా నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి గురువారం తరలించారు. అనంతరం రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడారు. మావోయిస్టులు వైరామవరం మండలం అటవీ ప్రాంతంలో సంచనిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీస్ పార్టీలు కూలింగ్ ఆపరేషన్ నిర్వహించగా బుధవారం సుమారు మధ్యాహ్నం 3 గంటల సమయంలో 30 నిమిషాల పాటు పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో జరిగినట్లు చెప్పారు. ఈ సంఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో కాకూరు పండన్న అలియాస్ జగన్ (ఎస్‌జెడ్‌సిఎం) రమేష్ అలియాస్ నాగన్న (డిసిఎం)గా గుర్తించినట్లు తెలిపారు. కాకూరు పండన్న ఇలియాస్ జగన్‌పై వందకు పైగా కేసులు నమోదు కాబడ్డాయని, రూ.20 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. పొడియామి అలియాస్ రమేష్‌పై సుమారు 30 పైగా కేసులు, రూ.5 లక్షల రివార్డు ఉందని చెప్పారు. వీరు వద్ద నుంచి సంఘటన స్థలంలో రెండు ఏకే 47లు, ఒక 103 తుపాకీ, నాలుగు మ్యాగజైన్లు, మూడు ఏకే అండ్ ఒక 30 మ్యాగజైను, మ్యాగజైన్ పౌచులు, మందులు, ఒక చిన్న కత్తి, రూ.98 వేల నగదు, కిట్ బ్యాగులు, కళ్లద్దాలు, మూడు జతలు మావోయి సాహిత్యం పుస్తకాలు, ఆలివ్ గ్రీన్ యూనిఫామ్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వీరిపై అడ్డతీగల సర్కిల్ వైరామవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా మావోయిస్టులు లొంగిపోవాలనుకుంటే వారిని అల్లూరి జిల్లా పోలీసులు సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఏఎస్పీ (రంపచోడవరం ఓఎస్‌డి ఇంచార్జ్) కె.ధీరజ్, చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, రంపచోడవరం డిఎస్పీ జి సాయిప్రశాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్‌పి అమిత్ బర్దర్ తదితరులు

రూ.రెండున్నర కోట్ల కుంభకోణంపై విచారణ చేపట్టాలి

భారతి ట్రైబల్ ఉమెన్ ఎకనామికల్ సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ మాజీ అధ్యక్షులు జగ్గమ్మ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు పంచాయతీ పరిధి రత్నాపురం గ్రామంలో ఉన్న ది భారతి ట్రైబల్ ఉమెన్ ఎకనామికల్ అండ్ సోషల్ డెవలప్మెంట్ సొసైటీలో రెండున్నర కోట్ల కుంభకోణం చోటుచేసు కుందని, దానిపై విచారణ చేపట్టాలని ఆ సొసైటీ మాజీ అధ్యక్షులు జగ్గమ్మ డిమాండ్ చేశారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన శంకర్ ప్రసాద్, కాకినాడకు చెందిన గోదావరి నాలెడ్జ్ రవి, మోతుగూడెంకి చెందిన శరత్ అనే వ్యక్తి రత్నాపురం గ్రామంలో 2019 సంవత్సరంలో ది భారతి ట్రైబల్ ఉమెన్ ఎకనామికల్ అండ్ సోషల్ డెవలప్మెంట్ సొసైటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాదాపు 776 మంది ఆదివాసీ డ్వాక్రా మహిళలు సభ్యులుగా చేర్చుకొని తనను అధ్యక్షులుగా ఎన్నుకున్నారని తెలిపారు. ఆదివాసీ మహిళలకు జీవన ఉపాధి కల్పిస్తామని చెప్పి రత్నపురం గ్రామానికి చెందిన వంజం బుల్లమ్మ అనే ఆదివాసీ మహిళ దగ్గర 7 ఎకరాలు భూమిని ఈ సొసైటీ తరుపున లీజుకు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భూమి లీజుకు తీసుకొని దాదాపు ఐదు సంవత్సరాలైనా ఇంతవరకు ఆ భూమి యజమానికి డబ్బులు ఇవ్వలేదన్నారు. ఆ భూమిలో రకరకాల కూరగాయలు కూడా పండించినట్లు చెప్పారు.

ఇది ఇలా ఉండగా తనకు, సొసైటీ సభ్యులకు తెలియకుండానే తనను అధ్యక్షులుగా తొలగించి వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తిని ప్రెసిడెంట్‌గా తెఎట్టుకోవడం జరిగిందని ఆరోపించారు. ఈ సొసైటీ మొత్తం తన పేరు మీదే రిజిస్ట్రేషన్ చేసి ఉందని, కరెంటు మీటర్ కూడా తన పేరుమీదే ఉందని పేర్కొన్నారు. అయితే కరెంట్ బిల్లు దాదాపు 40 వేలు వచ్చిందని, ఈ బిల్లు చెల్లించాలని ఎన్నిసార్లు సదరు వ్యక్తులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళలకు జీవన ఉపాధి కల్పిస్తామని ఆరోజు అనేక మాటలు చెప్పి, నేడు పట్టించుకోకపోగా, సొసైటీకి చెందిన దాదాపు రెండున్నర కోట్లు రూపాయలు డబ్బులు ఎవరి దగ్గర ఉన్నాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి, అధికారులకు జగ్గమ్మ విజ్ఞప్తి చేశారు.

సొసైటీ మాజీ అధ్యక్షులు జగ్గమ్మ

కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి

ఐసిడిఎస్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-చింతపల్లి : వేసవి సెలవుల నేపథ్యంలో స్వగ్రామాలకు వచ్చిన కిశోర బాలికల రక్షణపై తల్లిదండ్రులు, సమాజం ప్రత్యేక దృష్టి సారించాలని ఐసిడిఎస్ అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం.రామలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ, మండలంలో మల్లవరం, కృష్ణాపురం అంగన్వాడి కేంద్రాల పరిధిలో కిషోర్ వికాసంపై నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాలికలు ఎక్కడికైనా బయటికి వెళ్లేటప్పుడు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బాలికల విద్యా, ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు పూర్తి భాగస్వామ్యంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ కుమారి, గౌరీ, గౌహరున్నీషా, అంగన్వాడి కార్యకర్తలు చిలకమ్మా, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లను గుర్తించాలి

ప్రజాశక్తి -అనంతగిరి: ఐదవ తరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతిలో చేరే విద్యార్థులకు జాయ్ ఫుల్ లెర్నింగ్‌లో భాగంగా సమ్మర్ స్పెషల్ విద్యా వాలంటిర్లు నియామకంపై వెల్ఫేర్. ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళ పోలీస్‌లు కృషి చేయాలని మండల పరిషత్ అభివద్ధి అధికారి ఏవివి. కుమార్, సహాయ గిరిజన సంక్షేమ మండల అధికారి కె. వెంకటరమణ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లో ఐదవ తరగతి ఉత్తీర్ణత సాధించి ఆరో తరగతి లో చేరే విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ అందించేందుకుగాను మండలంలోని 24 పంచాయితీ పరిది గ్రామాలలో పదో తరగతి,. డిగ్రీ, బిఈడి చదివి ఖాళీగా ఉన్న అభ్యర్థులను విద్యా వాలంటరీగా పనిచేసేందుకు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత విశాఖ లక్ష్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : బాల్య వివాహ రహిత విశాఖ ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంశున్నీసా బేగం అన్నారు గురువారం అప్‌హోల్డ్ సంస్థ 'యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' అనే ప్రాజెక్ట్‌లో భాగంగా విశాఖ పౌరగ్రంథాలయంలో పలు ధార్మిక సంఘ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బాల్యివాహాలు నిషేధంలో ధార్మిక సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. మైనార్టీ సంక్షేమ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ బాల్య వివాహాల అనర్థాలపై ప్రజలను చైతన్యపరిచి, వాటి నిర్మూలనకు అప్రూవల్ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాము భాగస్వాములౌతామన్నారు. పురోహిత సంఘం ప్రతినిధి ఆర్ రామారావు మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని దేవాదాయశాఖ ద్వారా తమకు నిర్దిష్టమైన ఆదేశాలు వచ్చాయని, వాటికి కట్టుబడి తాము వ్యవహరిస్తున్నామన్నారు. క్రిస్టియన్ సమాజ ప్రతినిధులు ఇమ్మాన్యుయేల్, సువర్ణరాజు మాట్లాడుతూ బాల్యవివాహాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సాహించబోమన్నారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ, సమాజంలో విద్యను ప్రోత్సాహించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా బాల్యవివాహాల నిర్మూలనకు తమవంతు కృషి చేస్తామన్నారు.

యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ జి డేవిడ్‌రాజు మాట్లాడుతూ తమ సంస్థ విశాఖ జిల్లాలో అన్ని విద్యాసంస్థల్లో బాల్యవివాహాల నిషేధంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం బాల్యవివాహాలను నియంత్రిస్తామని ఆయాసంస్థల ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. అప్‌హోల్డ్ సంస్థ సబ్బంది చక్రవర్తి, కెవై.రత్నం పాల్గొన్నారు

రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృతం

ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ప్రపంచ రెడ్ క్రాస్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఐటీడీఏ సమావేశం మందిరంలో పాడేరు జిల్లా రెడ్ క్రాస్ శాఖ బృందం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా చైర్మన్, జాయింట్ కలెక్టర్, ఇన్చార్జి ప్రాజెక్టు అధికారి డాక్టర్ అభిషేక్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు .. జీన్ హెన్రి డ్యునాట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేయాలని, ఇప్పటికే జిల్లాలోని 22 మండలాలలో కార్యవర్గం రెడ్ క్రాస్ సేవలను నిర్విరామంగా కొనసాగిస్తుందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని అన్ని శాఖల ఉద్యోగులు రెడ్ క్రాస్ సొసైటీకి సహకరించాలని కోరారు. విరివిగా రక్తదాన శిబిరాలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే నూతన కార్యవర్గం ఎన్నికై ఐదు నెలల కాలంలో విశేష సేవలు అందిస్తున్నారన్నారు. సభ్యులందరూ ఐక్యమత్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని తెలిపారు. సొసైటీకి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సొసైటీ భవనంకు 10 సెంట్లు స్థలం కేటాయించడం జరిగిందని భవన నిర్మాణానికి కావలసిన నిధుల సేకరణకు కృషి చేయాలన్నారు. భవన నిర్మాణ డిజైన్‌ను రూపొందించి నివేదిక ఇస్తే రాష్ట్ర శాఖ సహకారంతో నిర్మాణ పనులకు ముందడుగు వేసేందుకు కృషి చేస్తామన్నారు. రక్తపు నిలువలు లేదనే మాట రాకుండా సేవలందించాలని అన్నారు. సభ్యులందరూ యూనిఫామ్‌గా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అన్ని శాఖల అధికారులకు సమన్వయపరిచి సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కు ఆయన ఆదేశించారు. అనంతరం చైర్మన్ జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా విస్తత సేవలు అందిస్తున్నారని, విపత్తు సమయంలో సహాయక చర్యలు పలు సామాగ్రి, నిత్యావసర వస్తువుల పంపిణీ, రక్తదాన శిబిరాలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సభ్యులు మరింత బలంగా పనిచేసి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వృద్ధులకు, పేదలకు రగ్గులు పంపిణీ చేసి అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్యులు రాఘవేంద్ర, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, వైస్ చైర్మన్ గంగరాజు, కార్యదర్శి గౌరీ శంకర్, కోశాధికారి సూర్యారావు, సభ్యులు ప్రసాద్ నాయుడు, జయలక్ష్మి, సంజీవరావు, రవి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, లైఫ్ మెంబర్స్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ

ఉపకరణాలు అందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: సమాజంలో విభిన్న ప్రతిభావం తులను కాపాడాల్సి బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో 80 విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు, బ్రెయిలీ లిపి కిట్లు, ట్రైసైకిళ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవితా సెంటర్లపై వికలాంగ పిల్లలు ఉన్న తలిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

తల్లిదండ్రులు భవిత సెంటర్లను సందర్శించి అక్కడ వికలాంగ చిన్నారులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. పిల్లవాడు రోజు వారీ పనులు ఎలా చేయాలో నేర్పిస్తారన్నారు. రాయడం, చదవడం కమ్యూనికేషన్ నైపుణ్యాలను నేర్పించాలన్నారు. చిన్నారులకు బేస్ లైన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కిట్లను సక్రమంగా వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, సర్వ శిక్ష ఎపిసివి ఎ స్వామి నాయుడు, ఐఇ కో ఆర్డినేటర్ కె.భాస్కరరావు, పలువురు ఎడ్యుకేషన్ రీసోర్సు పర్సన్లు, తలిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సివిల్ కోర్టులకు వేసవి సెలవులు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : ఈనెల 10 నుంచి వచ్చేనెల 13 వరకు ప్రధాన జిల్లా, అదనపు జిల్లా న్యాయమూర్తులకు, సివిల్ సీనియర్ డివిజన్ న్యాయస్థానాలకు వేసవి సెలవులు. ఈ మేరకు ప్రత్యేక కోర్టులకు వేసవి సెలవులు ప్రకటిస్తూ గురువారం ఎపి హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్స్ ఉత్తర్వులు జారీ చేశారు.

దీంతో విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని అన్ని జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ న్యాయస్థానాల పరిధిలోని అత్యవసర కేసులను మొదటి విడతలో నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం నాగేశ్వరరావు అర్జంట్ అవుట్ అఫ్ ఆర్డర్ కేసులను విచారణకు స్వీకరిస్తారు. రెండో విడతగా అదనపు ఫ్యామిలీ న్యాయస్థానం అర్జంట్ కేసులను విచారణ చేస్తారు. కాగా జూనియర్ డివిజన్ సివిల్ న్యాయస్థానాలకు ఈనెల 19 నుండి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి.

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ఎన్నికైన గ్రామ కమిటీ నేతలు

ప్రజాశక్తి-జీకే వీధి: మండలంలో రింతాడ పంచాయితీ టిడిపి గ్రామ కమిటీ మండల అధ్యక్షులు ముక్కలి రమేష్ ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గురువారం రింతాడ గ్రామంలో పంచాయితీ నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా వడేలు పాండురాజు, ఉపాధ్యక్షులుగా సాగిన రామారావు, ప్రధాన కార్యదర్శులుగా సెగ్గే సంజీవరావు, మొట్టడం శరభన్న దొర, కోశాధికారిగా రాజపు రాజు, కార్యదర్శులు సహాయ కార్యదర్శులుగా జల్లి లక్ష్మమ్మ, సాగిన చిన్నయ్య పడల్, కిల్లో సింహాచలం. తగ్గి శ్రీరాములు, మడపల లక్ష్మి, సోమేల లోవకుమారి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.

స్వదేశీ మత్స్యకారులతో భేటీ

మత్స్యకారులతో భేటీ అయిన బీహార్ అధికారుల బృందం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరు గ్రామ సాంప్రదాయ స్వదేశీ మత్స్యకారుల జీవన విధానం, మత్యసాగులో మెలుకువలు, రవాణా, వ్యాపార సూత్రాలపై బీహార్ రాష్ట్ర మత్యశాఖ డైరెక్టర్ అభిషేక్ రంజన్ ఆధ్వర్యంలోని బృందం పరిశీలించింది. గురువారం తాటితూరులో పర్యటించి గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో స్థానిక మత్స్యకారులతో సమావేశమై పలు అంశాలను వివరించారు. అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మత్స్యశాఖ విశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు మాట్లాడుతూ, మత్స్యకార సహకార సంఘాల నియమ నిబంధనలు, కార్యకలాపాలు, విధి విధానాలను వివరించారు.స్థానిక స్వదేశీ మత్స్యకారులు చేపలు సాగు పద్ధతులు, ఎదుర్కొనే సమస్యలపై బీహార్ రాష్ట్ర మత్స్యశాఖ అధికారుల బృందం అడిగి తెలుసుకుంది. అనంతరం జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేట వద్ద ఉన్న ఆర్‌జిసిఎను సందర్శించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ రిటైర్డ్ జెడి కె ఫణిప్రకాష్, నైపుణ్యత శిక్షణా కేంద్రం అధికారి ఎకె రెడ్డి, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎం విజయకృష్ణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.లావణ్య, మత్స్య శాఖ సహాయకులు సుమంజలి పాల్గొన్నారు. ముందుగా బీహార్ అధికారుల బృందానికి తాటితూరు మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు సింగిడి అప్పలరాజు స్వాగతం పలికారు

ఫోటో, తాటి తూ రు రైతు సేవా కేంద్రం వద్ద మత్య కార సహకార సంఘం ప్రతినిధుల తో బీహార్ రాష్ట్ర మత్య శాఖ డైరెక్టర్ అభిషేక్ రంజన్ బంద సభ్యులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో కొత్త రేషన్ కార్డులకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిజిటల్ అసిస్టెంట్ విజయ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెల్ల రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవటానికి ఈనెల 8 నుంచి వచ్చే నెల 8 వరకు గడువు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆన్లైన్లో దరఖాస్తుతో పాటు ఈకేవైసి చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తెల్లరేషన్ కార్డులో ఉన్న వ్యక్తులు మృతి చెందినట్లయితే తొలగించుకోవడానికి, వేరే ప్రాంతానికి అడ్రస్ మార్పులు చేసుకోవడానికి ప్రభుత్వం ఆప్షన్ కల్పించిందని వెల్లడించారు. ఈ అవకాశానికి అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాంగి దుర్జో, గుమస్తా ప్రకాష్, సచివాలయ యానిమల్ అసిస్టెంట్ అనుష్క తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో గురువారం ఉదయం ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.1.22లక్షలతో కిలో మంగరాజు రైతు పొలంలో నీటి కుంట నిర్మాణ పనులను సర్పంచ్ పాయింట్ దుర్జో, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు పనులు పూర్తయితే జూన్ నెలలో వర్షాలకు వర్షపు నీరు నిల్వ ఉంటుందని, పంటలు పండించుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పనుల్లో పాల్గొని ఉపాధి పొందవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్, కాంగ్రెస్ నామకులు కారే శ్రీనివాస్, తెదేపా నాయకులు సన్యాసిరావు, విఆర్‌పి పృధ్వీరాజు, గిరి రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని చప్టా సమీపంలో ద్విచక్ర వాహనాన్ని టాటా మ్యాజిక్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తుమ్మిలేరు పంచాయతీ పరిధి గొందూరూ గ్రామానికి చెందిన పొగల హరికృష్ణారెడ్డి, కేచ్చేల కిరణ్ ఇద్దరూ గురువారం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా, అటవీ ప్రాంతంలో ఒక చప్టా వద్ద ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న హరికృష్ణారెడ్డి, కిరణ్‌కు గాయాలు కావడంతో అటుగా వస్తున్న మరో వాహనదారులు వారిని రేఖపల్లి పిహెచ్సిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో హరికృష్ణారెడ్డి తలకు, ముక్కుకు, పైపెదవికి తీవ్ర గాయాలుకాగా, కిరణ్‌కు స్వల్ప గాయలయ్యాయి. వారికి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి, తీవ్రగాయాలైన హరికృష్ణారెడ్డిని మెరుగైన వైద్యం నిమిత్తం కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

బాదంతో గుండెకు మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గుండె ఆరోగ్యానికి బాదం ఎంతో మేలు చేస్తుందని మ్యాక్స్ హెల్త్‌కేర్ డైటెటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ అన్నారు. గురువారం ఉదయం బీచ్ రోడ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీచ్ వాకర్స్‌ను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రానున్న మాతృ దినోత్సవాన్ని కాలిఫోర్నియా బాదంతో జరుపుకోవాలని, తద్వారా ఇంటిల్లపాదికి ప్రోటీన్, జింక్, మెగ్నీషియం, విటమిన్ ఇ వంటి 15 రకాల పోషకాలు లభిస్తాయని తెలిపారు.

లేటరైట్ విధ్వంసం

◆ లోయలుగా మారిన తవ్వక ప్రాంతం ◆ గిరిజనుల జీవనోపాధికి దెబ్బ
◆ మూసుకుపోనున్న గెడ్డలు ◆ సాగు, తాగునీటికి కరువు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'గనుల తవ్వకాలతో పొయ్యిలోకి పుల్లముక్క దొరకదు. తాగడానికి నీరుండదు. పంటలు నష్టపోతాం. ఏకమై ఆడ, మగ వెళ్లి మైనింగ్ ఆపుచేస్తాం' అని అసనగిరికి చెందిన గిరిజనుడు జర్తా వెంకటస్వామి అన్నాడు. ఆయన మాటల వెనుక లేటరైట్ తవ్వకాలకు అనుమతులిచ్చిన భూములకు ఆనుకొనివున్న పోడు వ్యవసాయం, దాని కిందవున్న గెడ్డలు దెబ్బతింటాయన్న ఆందోళన వుంది. గిరిజనులకే కాదు, నర్సీపట్నం నియోజకవర్గంలోని నాతవరం మండలం, సుందరకోట పంచాయతీ నాగులకొండ లేటరైట్ తవ్వకాల ప్రదేశాన్ని దగ్గరకెళ్లి చూసిన వారెవరికైనా మైనింగ్ తవ్వకాల నష్టం అర్థమవుతుంది. నేలమట్టానికి కొన్ని వందల అడుగుల లోతులో లేటరైట్ తవ్వుతున్నారు. కొండపైనున్న చెట్లను అనుమతుల్లేకుండానే నరికిపడేస్తున్నారు. భమిడికలొద్దీ అన్‌సర్వేడ్ ల్యాండ్‌లోని భమిడికిలొద్దిలో జర్తా లక్ష్మణరావుకు లేట్‌రైట్ తవ్వకాలకు కేటాయించిన 296.34 ఎకరాలు, సింగం భవానికి కేటాయించిన 97 ఎకరాలు, కె.లోవరాజుకు కేటాయించిన 50 ఎకరాల్లో మైనింగ్ వ్యాపారుల తవ్వకాలు జరుగుతున్నాయి. అవి జోరందుకుంటే కొండల కింద ఒదిగివున్నట్లు కనిపించిన గిరిజన ఆవాసాలు నిర్జీవంగా మారనున్నాయి.

తవ్వకాలతో లోయలా మారిన నాగులకొండ

రానురానూ నివాసిత ప్రాంతాల దరిలో తవ్వకాలు జరిగితే పోడు వ్యవసాయం, కొండ కిందన పండించే వరి, ఇతర ఆహార పంటలకు నీటి వసతి లేకుండా పోతుంది. లేటరైట్ తవ్వకాలకు వేసిన మార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తే కొండలు, వాటిపైనున్న వివిధ రకాల చెట్లు, మొక్కలు ధ్వంసమవుతాయని ఇట్టే అర్థమవుతుంది. సిమెంట్ తయారీ, ఇతర నిర్మాణ అవసరాలకు ఉపయోగిస్తున్న లేటరైట్‌కు డిమాండ్ వుండడంతో మైనింగ్ వ్యాపారులు, వారికి సహకరిస్తున్న అధికార పార్టీ పెద్దల కళ్లన్నీ నాతవరం అన్‌సర్వేడ్ ల్యాండ్‌లోని లేటరైట్ చుట్టూ తిరుగుతున్నాయి. ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజనుల హక్కులు, వనరులు, ఖనిజాలను కాపాడాల్సిన వారంతా ఒక్కటై లూఠీ చేస్తున్నారు. లేటరైట్ తవ్వకాలతో నాతవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రాజవొమ్మంగి మండలంలోని పలు గ్రామాలు ప్రభావితమవుతాయి. అసనగిరి, సిరిపురం, ముంతమామిడిలొద్దు, భమిడికలొద్దీ, తొరడ, యక్రంపేట, సరుగుడు, సుందరపుకోట, కిండంగి సహా పలు గిరిజన గ్రామాలకు నష్టం వాటిల్లనుంది.

'మేముండే కొండ అవతల మైనింగ్ జరుగుతోంది. మావైపు తవ్వితే జీడితోటలు పోతాయి. కొర్రలు, జొన్న, గంటెలు వంటి పంటలు నాశనమవుతాయి. నీరు దొరకదు' అని సల్ల గంగరాజు వాపోయాడు. లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తున్న గిరిజనులను ప్రలోభపెట్టేందుకు నర్సీపట్నానికి చెందిన మైనింగ్ వ్యాపారి డబ్బులు ఇస్తున్నాడు. గిరిజనులను చీల్చి లేటరైట్ తవ్వకాలకు అనేక కుయుక్తులు పన్నుతున్నాడు. లేటరైట్ లాభం రుచి మరిగిన వ్యాపారులు ఇంకొంతమంది గిరిజనులతో దరఖాస్తులు చేయించారు. ఆ దరఖాస్తులకు అనుమతులు లభిస్తే వందల ఎకరాల అన్‌సర్వేడ్ ల్యాండ్ కొండలు లేటరైట్ తవ్వకాలతో పెద్దపెద్ద లోయలుగా మారుతాయి.

జాతీయ రహదారిపై నిత్య ప్రమాదాలు

ఆందోళన చెందుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అల్లూరి జిల్లా పోలవరం నుండి రాజవొమ్మంగి మీదుగా పాడేరు వెళ్లే 516ఈ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. మండలంలోని కొండపల్లి నుండి గంగవరం, అడ్డతీగల రహదారి మధ్యలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు సుమారు 20 మంది వరకు గాయపడగా ఒకరు మృతి చెందారు. నెల రోజుల వ్యవధిలోనే ప్రమాదాల్లో 15 మంది గాయపడ్డారు. పదుల సంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయి. జాతీయ రహదారిపై పశువులు విచ్చలవిడివిగా తిష్ట వేయడంతో రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారులపై పశువులు సంచరించడంపై ఇటీవల అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన ఫలితం శూన్యం. దీనికి తోడు రహదారికి ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడం వలన కూడా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలువురు వాహనదారులు చెబుతున్నారు. ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఇటీవల ఐటిడిఏ పిఓకు, ఇతర అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అధికారులకు చర్యలకు ఉపక్రమించిన ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలని రామారావు కోరారు.

ప్రమాదానికి గురైన వ్యక్తి

సిఐ స్వర్ణలతే ఎసిబి నకిలీ ఎస్‌పి

- అరెస్టు చేసిన పోలీసులు
- గతంలో ఆమెపై నోట్ల మార్పిడి కేసు

ప్రజాశక్తి - మధురవాడ : స్థానిక సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని బెదిరించిన నకిలీ ఎసిబి ఇన్‌స్పెక్టర్ సుధాకర్ కేసులో ఆసక్తికర ట్విస్ట్ చోటుచేసుకుంది. సుధాకర్ భాగోతం వెనుక గతంలో ఇలాంటి నేరాలకే పాల్పడి వేటుకు గురైన రిజర్వ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత ఉందని పోలీసులు గురువారం తేల్చారు. ప్రస్తుతం బాపట్ల ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో సిఐగా పనిచేస్తున్న ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పిఎం.పాలెం సిఐ బాలకృష్ణ వెల్లడించారు.

అసలింతకీ ఏం జరిగింది ?

సుధాకర్ అనే వ్యక్తి బుధవారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తాను ఎసిబి సిఐనని రిజిస్ట్రార్‌ను పరిచయం చేసుకున్నాడు. రెండు మూడు రోజుల నుంచి గమనిస్తున్నానని, ఉద్యోగం పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని రిజిస్ట్రార్‌ను బెదిరించాడు. ఎటువంటి కేసూ లేకుండా చేసేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ 'మీరు ఎసిబి సిఐ అని ఎలా నమ్మాలి' అని ఎదురు ప్రశ్నించాడు. దీంతో ఎసిబి ఎస్‌పిగా చెప్పుకునే ఒక మహిళతో సుధాకర్ ఫోనులో మాట్లాడించాడు. ఆ మహిళ సైతం తాను ఎసిబి ఎస్‌పినని బెదిరించడంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి నకిలీ ఎసిబి అధికారిని అదుపులోకి తీసుకున్నారు. కూపీ లాగితే ఒక్కొక్కటిగా విషయాలు వెలుగుచూశాయి. సుధాకర్ ఫోన్‌లో నకిలీ ఎసిబి ఎస్‌పిగా పరిచయం చేసుకుని రిజిస్ట్రార్ చక్రపాణిని స్వర్ణలత బెదిరించినట్టు ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఆమెను అరెస్టు చేశారు. గతంలో విశాఖలో రూ.2 వేల నోట్ల మార్పిడి వ్యవహారంలో కొందరిని ఆమె బెదిరించి అరెస్టయి, జైలుకు కూడా వెళ్లారు.

కెజిహెచ్ నుంచి రిమాండ్ ఖైదీ పరార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ ఒకరు గురువారం పరారవడం చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఓ చోరీ కేసుకు సంబంధించి ఎంవిపి క్రైమ్ పోలీసులు ఇటీవల విజయవాడ సమీప కొండపల్లికి చెందిన నామాల నాగరాజును అరెస్టు చేసి విశాఖలోని సెంట్రల్ జైలుకు తరలించారు. క్రైం నెంబర్ 167/2025 కింద నాగరాజుపై బిఎన్ఎస్ చట్టం ప్రకారం 307 సెక్షన్ నమోదు చేశారు. తనకు ఆరోగ్యం బాలేదని చెప్పడంతో ఎస్కార్ట్‌ను ఇచ్చి సెంట్రల్ జైలు సిబ్బంది నాగరాజును కెజిహెచ్‌లోని ఎస్-2 వార్డుకు తరలించారు. గురువారం ఉదయం 8.30 గంటల సమయంలో ఎస్కార్టు కళ్లుగప్పి కెజిహెచ్ నుంచి నాగరాజు పరారయ్యాడు. ఆయన కోసం గాలింపు కొనసాగుతోంది. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణ గోడల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరాభివృద్ధే ధ్యేయంగా పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్టు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన మూడో జోన్ 15వ వార్డు పరిధి వెంకోజీపాలెం కొండ వాలు ప్రాంతాల్లో పలు రక్షణ గోడల నిర్మాణాలకు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు పలు కంపెనీలను నగరంలో నెలకొల్పుతున్నామన్నారు. వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు చాలా అవసరమున్నందున కార్పొరేటర్ సూచనల మేరకు 15వ వార్డులో రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో పలు కొండవాలు ప్రాంతాలలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ రక్షణ గోడల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి సంబంధిత కాంట్రాక్టర్లు అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మూడో జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీరు గంగాధర్, సచివాలయ కార్యదర్శులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి విజన్ ఎఐ టెక్నాలజీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టెలివిజన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్న నేపథ్యంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకుంటూ విజన్ ఎఐ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకు వస్తున్నట్టు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ విజువల్ డిస్ ప్లే బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విప్లవేష్ డాంగ్ తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అల్ట్రా ప్రీమియం 2025 మోడళ్లను ఆవిష్కరించారు.